మార్చి నాటికి భూభారతి కొత్త పోర్టల్

- ఒకే గొడుగు కిందకు రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్
- వారం రోజుల్లో మరో 3వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

విశ్వంభర, హైదరాబాద్ : రెవెన్యూ, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ విభాగాలను భూభారతి పోర్టల్‌లో ఒకే గొడుగు కిందకు తీసుకువస్తున్నామని ఈ పోర్టల్‌ను మార్చి నాటికి పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు, పారదర్శకంగా ఉండేలా ఈ పోర్టల్‌ను రూపొందించామని వెల్లడించారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, దేవాదాయ, అటవీ, వక్ఫ్ భూములు తదితర అన్ని వివరాలు కనిపించేలా పోర్టల్‌లో పొందుపరిచామని తెలిపారు. మంగళవారం నాంపల్లిలో తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెస్సా) 2026 డైరీని మంత్రిగారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వ పదేళ్ల పాలనలో రెవెన్యూ వ్యవస్థలో ఎదుర్కొన్న సమస్యల నుంచి విముక్తి లభిస్తుందనే నమ్మకంతో తెలంగాణ ప్రజానీకం ఇందిరమ్మ ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పదేళ్ల కాలంలో భ్రష్టు పట్టిన రెవెన్యూ వ్యవస్థను ఒక్కో మెట్టు పేర్చుకుంటూ గ్రామ స్థాయి వరకు బలోపేతం చేశామని ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చామని అయితే ఇవి సరిపోవని ఇంకా చేయాల్సింది ఎంతో ఉందని మంత్రి గారు అన్నారు. రాష్ట్రంలో దశాబ్దాలుగా సాగుతున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనకు అనుగుణంగా గడచిన రెండేళ్లలో ఎన్నో విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకున్నామని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూభారతి పోర్టల్ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. తెలంగాణ రైతుల భూములకు సంబంధించి గుండెకాయలాంటి సర్వే విభాగాన్ని పటిష్టపరుస్తున్నామని ఇందులో భాగంగా ఇప్పటికే 3500 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను తీసుకోవడం జరిగిందని వారం రోజుల్లో మరో మూడువేల మందిని తీసుకోబోతున్నామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు తమ ప్రభుత్వం అర్థం చేసుకుందని, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక ఇబ్బందుల వల్లే కొంత ఆలస్యం జరుగుతుందని ప్రభుత్వం తరపున ప్రభుత్వ ఉద్యోగులకు అందాల్సిన అన్ని ప్రయోజనాలను అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రెస్సా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంగా రవీందర్ రెడ్డి, గౌతమ్ కుమార్, కోశాధికారి రమణారెడ్డి, కల్చరల్ డైరెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, టిఎన్‌జీవో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏలూరి శ్రీనివాస్, జగదీష్, ఆర్డీవో ఉపేందర్ రెడ్డి జిహెచ్ఎంసీ జోనల్ కమీషనర్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

సీఎంలు మారుతున్నారు..

మా భూములు అమ్ముతున్నారు : పట్నం మహేందర్ రెడ్డి

విశ్వంభర, బ్యూరో : తెలంగాణ శాసన మండలి వేదికగా రంగారెడ్డి జిల్లా అభివృద్ధి, భూముల విక్రయాలపై ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, ఏ ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టినా రంగారెడ్డి జిల్లాలోని విలువైన భూములను విక్రయించి వేల కోట్ల రూపాయల ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారే తప్ప, ఆ జిల్లా అభివృద్ధికి తగిన వాటా ఇవ్వడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక ప్రస్తావనల సమయంలో మహేందర్ రెడ్డి ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యత కలిగిన విషయంగా సభ దృష్టికి తీసుకెళ్లారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి నేటి వరకు గత ముప్పై ఏళ్లుగా జరిగిన పరిణామాలను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. గతంలో ఎన్టీ రామారావు, చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి నుంచి నిన్నటి కేసీఆర్ ప్రభుత్వం వరకు అందరూ రంగారెడ్డి జిల్లా భూములను అమ్మే నిధులతోనే సంక్షేమ పథకాలను అమలు చేశారని ఆయన విమర్శించారు. ప్రభుత్వం నడవాలన్నా లేదా రాష్ట్రవ్యాప్త సంక్షేమ కార్యక్రమాలు కొనసాగాలన్నా రంగారెడ్డి జిల్లా భూములే ఆధారం అవుతున్నాయని, కానీ స్థానికంగా జిల్లా అభివృద్ధికి మాత్రం మొండిచేయి ఎదురవుతోందని పేర్కొన్నారు. జిల్లాలో ఎకరా భూమి ధర 150 కోట్ల రూపాయలకు పైగా పలుకుతోందని, అటువంటి విలువైన ఆస్తులను అమ్ముతున్నప్పుడు అందులో కనీసం 20 నుంచి 30 శాతం నిధులను నేరుగా జిల్లా అభివృద్ధి పనులకే కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న తనలాంటి నాయకులను జిల్లా ప్రజలు నిలదీస్తున్నారని, భూముల అమ్మకం ద్వారా వస్తున్న నిధులు జిల్లాకు ఏ మేరకు వాడుతున్నారో చెప్పలేక తాము ఇబ్బంది పడుతున్నామని వివరించారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో రంగారెడ్డి జిల్లా ప్రజలు తిరగబడతారని, పెద్ద ఎత్తున ఉద్యమాలు వచ్చే అవకాశం ఉందని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కనీసం ప్రస్తుత ప్రభుత్వమైనా గతానికి భిన్నంగా వ్యవహరించి, జిల్లాలో అమ్ముతున్న భూముల ద్వారా వచ్చే ఆదాయంలో 40 శాతం వరకు జిల్లా అభివృద్ధి కోసమే ప్రత్యేకంగా కేటాయించాలని మహేందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

ఏపీ లేకుంటే తెలంగాణ బతకలేదన్నారు

- మేం ఎలా అభివృద్ధి చెందామో చూడండి
- తెలంగాణ ఏర్పడితే నీళ్లు, విద్యుత్ ఉండదన్నారు
- ఈ సమయంలో ఆయన పేరు తాను చెప్పదలుచుకోలేదు
- కాంగ్రెస్ సీఎంగా ఆ మాటలు చెప్పి ఆ తర్వాత బీజేపీలో చేరారు
- అసెంబ్లీలో ఎంఐఎం శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ

విశ్వంభర, బ్యూరో : ఆంధ్రప్రదేశ్ లేకుండా తెలంగాణ మనుగడ సాగించలేదని పన్నెండేళ్ల క్రితం ఒక నాయకుడు వ్యాఖ్యానించారని, అయితే ఈ కాలంలో తెలంగాణ ఎంతగా అభివృద్ధి చెందిందో చూడాలని మజ్లిస్ పార్టీ శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. తాము లేకుంటే తెలంగాణకు విద్యుత్ ఉండదని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి పేర్కొన్నారని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే నీళ్లు, విద్యుత్ ఉండవని చెప్పారని తెలిపారు. ఆయన పేరును ప్రస్తావించదలుచుకోలేదని ఆయన అన్నారు. ప్రస్తుతం ఆయన వాషింగ్ మెషీన్ పార్టీ అయిన బీజేపీలో చేరారని ఎద్దేవా చేశారు. ఆయన కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆ వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. ఆ తర్వాత ఆయన పార్టీ మారారని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో కొన్ని మాటలను కావాలని తొలగిస్తున్నారని అక్బరుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. తాను ముఖ్యమైన విషయం గురించి మాట్లాడుతున్న సమయంలో ఆడియో డిస్టర్బెన్స్ వస్తోందని అన్నారు. హిల్ట్ (హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్) పాలసీపై చర్చ సందర్భంగా ఆయన అసెంబ్లీలో మాట్లాడారు.

పిల్లలు ఆడ,మగ తేడా లేకుండా సమానమే

విశ్వంభర, హరియాణా : హరియాణా రాష్ట్రం జింద్ జిల్లా ఉచానా ప్రాంతంలో ఓ మహిళ పదిమంది కూతుళ్ల తర్వాత 11వ కాన్పులో మగబిడ్డకు జన్మనిచ్చిన సంఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. తల్లి, శిశువు ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. ఈ ఘటనను కొందరు ఆశ్చర్యంగా చూసినా, సమాజంలో ఇంకా మగబిడ్డ పట్ల ఉన్న ఆకాంక్షను ఇది స్పష్టంగా బయటపెడుతోందని సామాజికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. పిల్లలు మగైనా, ఆడైనా సమానమేనని, కూతుళ్లు కూడా కుటుంబానికి గౌరవం, భవిష్యత్తు అని గుర్తించాల్సిన అవసరం ఉందని వారు సూచిస్తున్నారు. పదిమంది కూతుళ్లను పెంచుతూ బాధ్యతగా కుటుంబాన్ని నడిపిన ఆ తల్లి ధైర్యం, ఓర్పు అభినందనీయమని పలువురు పేర్కొంటున్నారు. ఈ ఘటన ఒక వ్యక్తిగత వార్తగానే కాకుండా, సమాజంలో మారాల్సిన ఆలోచనలపై చర్చకు దారితీస్తోందని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎర్ర జెండా ఎగురుతున్నది

పల్లవి :
జెండా ఎగురుతున్నది
ఎర్ర జెండా ఎగురుతున్నది
భారత కమ్యూనిస్టు పార్టీ
జెండా ఎగురుతున్నది
వందేళ్ళ పోరాటాల
చరిత చాటుతున్నది. ||జెండా||

చరణం 1:
భారతదేశం మెచ్చిన జెండా
కాన్పూర్ లో పుట్టిన జెండా
పేదల మదిలో మెరిసిన జెండా
కష్టజీవులు పట్టిన జెండా
పోరాటాల్లో వెలిగిన జెండా
దేశమంతట నిండిన జెండా
జెండా ఎగురుతున్నది
ఎర్రజెండా ఎగురుతున్నది
భారత కమ్యూనిస్టు పార్టీ
జెండా ఎగురుతున్నది
వందేళ్ళ పోరాటాల
చరిత చాటుతున్నది.

చరణం 2 :
కంటికి రెప్పల కాపలగుంటూ
కష్టజీవుల కాచే జెండా
మట్టి మనుషుల గుండెల్లోన
సంఘం శక్తిని నింపిన జెండా
వెట్టి బతుకుల బంధుక్ జెసి
సాయుధ పోరును నడిపిన జెండా
జెండా ఎగురుతున్నది
ఎర్రజెండా ఎగురుతున్నది.
భారత కమ్యూనిస్టు పార్టీ
జెండా ఎగురుతున్నది
వందేళ్ళ పోరాటాల
చరిత చాటుతున్నది.

చరణం 3:
తూర్పు దిక్కున సూర్యుడివోలే
ఎర్రని కాంతిని పంచిన జెండా
సంపూర్ణ స్వాతంత్రం కావాలంటూ
స్వాతంత్ర పోరు చేసిన జెండా
కార్మిక శ్రమకు విలువనుగట్టి
దోపిడీ గుట్టును విప్పిన జెండా
జెండా ఎగురుతున్నది
ఎర్రజెండ ఎగురుతున్నది
భారత కమ్యూనిస్టు పార్టీ
జెండా ఎగురుతున్నది
వందేళ్ళ పోరాటాల
చరిత చాటుతున్నది.

చరణం 4
దోపిడీ చేసే తిమింగలాలను
రోడ్డున కీడిచే శ్రామిక జెండా
మీరెట్టు కాన్పూర్ కుట్ర కేసులను
నిర్బంధాలను ఎదిరించిన జెండా
ఉన్మాదానికి ఊపిరి పోసే
మనువాదమును తరిమేజెండ
జెండ ఎగురుతున్నది
ఎర్రజెండ ఎగురుతున్నది
భారత కమ్యూనిస్టు పార్టీ
జెండ ఎగురుతున్నది
వందేళ్ళ పోరాటాల
జెండా ఎగురుతున్నది...

చరణం 5:
అమరవీరుల రక్తపు ధారల
సాహస బాటలో నడిచే జెండ
రక్తము చెందిన వీరుల త్యాగం
వృధా కాదని చాటిన జెండ
వర్గ రహిత సమాజం కోసం
సోషలిజాన్ని ప్రకటించిన జెండ
జెండ ఎగురుతున్నది
ఎర్రజెండ ఎగురుతున్నది
భారత కమ్యూనిస్టు పార్టీ
జెండ ఎగురుతున్నది
అజరామర పోరాటాల
జెండ ఎగురుతున్నది..

- రచన : కేవీఎల్
సెల్: 9490952649

తెలంగాణపై పవన్ కల్యాణ్ ఫోకస్

- జనసేన పార్టీ బలోపేతంపై దృష్టి
- పాత కమిటీలు అన్నీ రద్దు

విశ్వంభర, హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలకంగా మారారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంటూ డిప్యూటీ సీఎంగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మరోవైపు రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో జనసేన పార్టీని రాష్ట్రవ్యాప్తంగా మరింత బలోపేతం చేస్తున్నారు. అయితే, ప్రస్తుతం పవన్ కల్యాణ్ తెలంగాణ రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయడం పై దృష్టి పెట్టినట్లు తెలుస్తుంది. త్వరలో హైదరాబాద్ లో జరిగే జీహెచ్ఎంసీ ఎన్నికలే టార్గెట్ గా జనసేనాని ముందుకు సాగుతున్నట్లు సమాచారం. తెలంగాణ రాష్ట్రంలో కూడా జనసేన పార్టీకి మంచి జనాదరణ ఉంది. అయితే పవన్ కల్యాణ్ ఇన్నాళ్ళు తన పూర్తి సమయాన్ని ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపైనే కేటాయించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో జనసేన పార్టీ కీలక పాత్ర పోషిస్తుంది. దీనితో తెలంగాణలో కూడా జనసేన పార్టీ సిద్ధాంతాలను జనాలలోకి తీసుకెళ్లాలని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు జనసేనాని చర్యలు ప్రారంభించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది. ఈ క్రమంలో పవన్ కల్యాణ్ కీలక నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధమైనట్లు తెలుస్తుంది.

పాత కమిటీలు అన్నీ రద్దు

తెలంగాణలో జనసేన పార్టీకి కొత్త ఊపిరి పోసేలా హైకమాండ్ కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలోని జనసేన కమిటీలన్నిటినీ రద్దు చేస్తున్నట్టు పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి అధికారికంగా ప్రకటించారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ, వీరమహిళ, యువజన, విద్యార్థి విభాగాలకు చెందిన కమిటీలను పూర్తిగా తీసేసి, వాటి స్థానంలో తాత్కాలిక అడ్‌హాక్ కమిటీలను నియమించారు. ఈ అడ్‌హాక్ కమిటీలు మొత్తం 30 రోజుల పాటు పనిచేస్తాయి. ఈ కమిటీ సభ్యులు రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గం, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 300 వార్డులకు వెళ్లి విస్తృతంగా పర్యటిస్తారు. అక్కడ చురుకైన కార్యకర్తలను గుర్తించి, ప్రతి వార్డు నుంచి కనీసం ఐదుగురు సభ్యుల జాబితాను సిద్ధం చేసి పార్టీ కార్యాలయానికి సమర్పిస్తారు. ఈ నివేదికల ఆధారంగా త్వరలోనే కొత్త శాశ్వత కమిటీలను ప్రకటించి, పార్టీని సంస్థాగతంగా మరింత పటిష్ఠం చేయనున్నారు. ఈ పునర్వ్యవస్థీకరణతో తెలంగాణలో జనసేనకు కొత్త జోష్ వచ్చి, క్షేత్రస్థాయిలో బలమైన నాయకత్వం ఏర్పడుతుందని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. పవన్ నాయకత్వంలో పార్టీ మరింత చురుగ్గా ముందుకు సాగుతుందని కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.

'నేను హోం మంత్రిని అవుతాను.. తెలంగాణకు సీఎం బీసీ వ్యక్తే అవుతారు'

విశ్వంభర, హైదరాబాద్: అసెంబ్లీ స్పీకర్ తీరుకు నిరసనగా ఈ సెషన్ మొత్తాన్ని బీఆర్ఎస్ బహిష్కరించినా ఆ పార్టీకి చెందిన పదిమంది ఎమ్మెల్యేలు హౌజ్‌లోనే ఉండిపోయారు. ఎవరా పదిమంది అనే అనుమానం కలగడం సహజం. కానీ అది ముమ్మాటికీ నిజం. ఆ పార్టీకి చెందిన పదిమంది ఎమ్మెల్యేలు ప్రతీ రోజు సభకు హాజరవుతూనే ఉన్నారు. ఈ విషయమే అసెంబ్లీ లాబీల్లో బీజేపీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేల మధ్య చర్చనీయాంశమైంది. ఒకవైపు సెషన్ మొత్తాన్ని బహిష్కరించినట్లు డిప్యూటీ ఫ్లోర్ లీడర్ స్పష్టమైన ప్రకటన చేసినా ఆ పదిమంది ఎందుకు హాజరవుతున్నారనే గుసగులు వినిపించాయి. సరిగ్గా ఇదే అంశం గురించి బీజేపీ ఎమ్మెల్యేల రాకేష్‌రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మధ్య లాబీల్లో ఆసక్తికర చర్చ చోటుచేసుకున్నది.

టెక్నికల్‌గా ఆ పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే : అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మంగళవారం మధ్యాహ్నం లాబీలో బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తారసపడ్డారు. వారిద్దరి మధ్య సరదాగా జరిగిన సంభాషణ..

రాకేశ్‌రెడ్డి : నేను హోం మంత్రిని అవుతాను.. తెలంగాణకు సీఎం బీసీ వ్యక్తే అవుతారు.

దానం : అయితే అమిత్ షా ను తొలగిస్తారన్నమాట.

రాకేశ్‌రెడ్డి : ఈ సెషన్ మొత్తాన్ని బీఆర్ఎస్ బాయ్‌కాట్ చేసింది. కానీ ఇదే సభలో ఆ పార్టీకి చెందిన పది మంది ఎమ్మెల్యేలు రోజూ ఉంటూనే ఉన్నారు. (పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలలో దానం కూడా ఒకరిగా ఉండడంతో ఆ అంశాన్ని ఉద్దేశించి పరోక్షంగా కామెంట్)

దానం : నేను యుద్ధానికి ఎప్పుడైనా సిద్ధం (రిజైన్ చేసి ఉప ఎన్నికలో మళ్ళీ పోటీ చేయడానికి).

పీసీసీ చీఫ్ : ఆ పది మంది ఎమ్మెల్యేలు టెక్నికల్‌గా బీఆర్ఎస్‌లోనే ఉన్నారు. (సంభాషణల సమయంలో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఎంటర్ అయ్యారు)

కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్‌గా కవ్వంపల్లి

విశ్వంభర, హైదరాబాద్ : రాష్ట్ర కాంగ్రెస్ సంస్థాగత మార్పుల్లో భాగంగా ఎస్సీ డిపార్ట్ మెంట్ చైర్‌పర్సన్‌గా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను ఏఐసీసీ నియమించింది. తక్షణం ఈ ఉత్తర్వులు అమలులోకి రానున్నట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ గాంధీభవన్‌కు పంపిన కమ్యూనికేషన్‌లో పేర్కొన్నారు. ఇప్పటివరకూ ఈ బాధ్యతల్లో ప్రీతమ్ కొనసాగారు. తాజాగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదేశం మేరకు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నియమితులయ్యారు. ప్రస్తుతం మానకొండూరు నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్న డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వృత్తిరీత్యా వైద్యులు. ఉస్మానియా వైద్య కళాశాలలో జనరల్ సర్జరీ ప్రొఫెసర్‌గా దీర్ఘకాలం పనిచేశారు. రాష్ట్రంలోని ఎస్సీ కమ్యూనిటీకి చెందిన ఎమ్మెల్యేలలో డాక్టర్ కవ్వంపల్లికి ప్రత్యేక గుర్తింపు ఉన్నది. ఎస్సీ వర్గీకరణ కోసం కాంగ్రెస్ తరపున నిశితంగా అధ్యయనం చేసి ఏఐసీసీ స్థాయిలో చర్చించి రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ బిల్లును రూపొందించడంలో ఆయన ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇప్పుడు Congress SC Cell చైర్‌పర్సన్‌గా నియమితులు కావడం గమనార్హం.

సంగారెడ్డి కాంగ్రెస్‌లో జగ్గారెడ్డి చిచ్చు

విశ్వంభర, మెదక్: రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల హడావుడి మొదలైంది. ఓటర్ జాబితా సవరణ, పోలింగ్ స్టేషన్లలో మార్పులు, చేర్పుల వంటి డెవలప్ మెంట్‌తో త్వరలో మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ రాబోతుందన్న చర్చ జరుగుతోంది. వారం పది రోజుల్లో ఎన్నికలకు నోటిఫికేషన్ అని కొందరు..ఈ నెలాఖరులో ఎన్నికల షెడ్యూల్ రావొచ్చని మరికొందరు అంచనాలతో గ్రౌండ్ వర్క్ చేస్తున్నారు. సంగారెడ్డి జగ్గారెడ్డి మాత్రం మిగతా కాంగ్రెస్ లీడర్ల కంటే ఓ అడుగు ముందే ఉన్నారు. సర్పంచ్ ఎన్నికలు అలా ముగిశాయో లేదో..ఇలా మున్సిపల్ ఎన్నికలపై ఫోకస్ పెట్టారు. ఎవరెవరికి ఏయే పోస్టులు ఇవ్వాలో డిసైడ్ కూడా చేశారు. దీంతో మిగతా ఆశావహులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ రచ్చ చేయడం హాట్ టాపిక్గా మారింది.

జగ్గారెడ్డి ప్రకటనతో గుర్రు

సంగారెడ్డి జిల్లాలో మున్సిపల్ ఎన్నికల హడావుడి పాలిటిక్స్‌ను హీటెక్కిస్తోంది. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తన నియోజకవర్గంలో ఉన్న రెండు మున్సిపాలిటీల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. అయితే ముఖ్య కార్యకర్తల సమావేశంలో జగ్గారెడ్డి చేసిన ఓ ప్రకటన రసాభాసకు దారితీసింది. సంగారెడ్డి, సదాశివపేట రెండు

మున్సిపాలిటీలు ఉండగా సంగారెడ్డి మున్సిపల్ ఛైర్మన్‌గా కూనంతు, వైస్ ఛైర్మన్‌గా షఫీని ప్రకటించారు జగ్గారెడ్డి. ఇక సదాశివపేట మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల పేర్లను తర్వాత ప్రకటిస్తానని చెప్పారు. ఒకవేళ రిజర్వేషన్లు మారి సంగారెడ్డి మున్సిపాలిటీ ఎస్సీ రిజర్వ్ అయితే మహేష్ లాల్ ఛైర్మన్‌గా ఉంటారని జగ్గారెడ్డి ఎనౌన్స్ చేశాడు.

సీనియర్లు ఉండగా జూనియర్లకు అవకాశం ఇవ్వమేంటి?

అసలు ఎన్నికల నోటిఫికేషన్ రాలేదు..పైగా కౌన్సిలర్లుగా ఎవరెవరు పోటీ చేస్తారో క్లారిటీ లేదు. అంతకంటే ముందే ఛైర్మన్, వైస్ ఛైర్మన్లను అనౌన్స్ చేయడమేంటంటూ ఓవైపు చర్చ జరుగుతూనే ఉంది. సరిగ్గా ఇదే టైమ్‌లో మీటింగ్‌లో రచ్చ స్టార్ట్ అయింది. సంగారెడ్డి మున్సిపాలిటీలోని శాంతినగర్ వార్డుకు చెందిన సునీల్..మహేష్ లాల్‌ను మున్సిపల్ ఛైర్మన్‌గా ఎలా ప్రకటిస్తారని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎంతోమంది సీనియర్లు ఉండగా..మహేష్ లాల్ కు అవకాశం ఇవ్వమేంటని ప్రశ్నించాడు సునీల్. దీంతో సభ రసాభాసగా మారింది.

ఆవేశంతో ఊగిపోయిన జగ్గారెడ్డి..

ఒకదశలో జగ్గారెడ్డి ఆవేశంతో ఊగిపోయారు. ఎవరూ వీడియోలు తీయకండి ఇది పార్టీ అంతర్గత వ్యవహారం అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తర్వాత కొంత శాంతించిన జగ్గారెడ్డి ఇది పార్టీ నిర్ణయం సునీల్ అని చెప్పినా వినకపోవడంతో బయటకు పంపించి సభను యథావిధిగా నడిపించారు. సదాశివపేట, సంగారెడ్డి మున్సిపాలిటీలలో అభ్యర్థులను మీరే నిర్ణయించుకుని గెలిపించుకుని రావాలని పిలుపునిచ్చారు జగ్గారెడ్డి. ప్రచారానికి రానని, కౌన్సిలర్ టికెట్ కావాలని తన దగ్గరకు కానీ, నిర్మలా జగ్గారెడ్డి దగ్గరకు కానీ ఎవరూ రావొద్దని స్పష్టం చేశారు. ఈ రెండు మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగరేయాల్సిందేనని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు జగ్గారెడ్డి. అయితే కోయిల ముందే కూసిందన్నట్లుగా..జగ్గారెడ్డి ముందుగా మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పేర్లను ప్రకటించడం చర్చకు దారితీస్తోంది. ముఖ్యనేతలెవరితో చర్చించకుండా ఏకపక్షంగా అభ్యర్థులను అనౌన్స్ చేయడమే రచ్చకు దారితీసిందంటున్నారు లోకల్ కాంగ్రెస్ లీడర్లు. ఎన్నో ఏళ్లుగా తాము కాంగ్రెస్ జెండా మోస్తున్నామని..అవకాశం వచ్చినప్పుడు కూడా తమలాంటి వాళ్లకు టికెట్ ఇవ్వకుండా.. నచ్చిన నేతలను అందలమెక్కించడం ఏంటంటూ ప్రశ్నిస్తున్నారు. ఏదైనా తన మార్క్ డెసిషన్స్‌తో..జగ్గారెడ్డి మరోసారి చర్చకు..సేమ్‌టైమ్ రచ్చకు అవకాశం ఇచ్చారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.